www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 18 జూన్ 2025

5

తూర్పుగోదావరి



'నన్నయ' రిజిస్ట్రార్ సుధాకర్ బదిలీ

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మంగళవారం బదిలీ అయ్యారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం హ్యూమన్ జెనిటిక్స్ ఆచార్యులుగా బదిలీపై వెళ్ళారు. ఆయన స్థానంలో కెవి.స్వామిని ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా నియమిస్తూ విసి ఎస్.ప్రసన్నశ్రీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సుధాకర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడారు. 2023 ఆగస్టు 18 నుంచి సుధాకర్ రిజిస్ట్రార్‌గా సేవలు అందించారన్నారు. సుధాకర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల అభివద్ధిలో భాగస్వామ్యమైనందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. విశ్వవిద్యాలయ అధికారులు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సుధాకర్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ఆచార్య కెవి.స్వామి ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు విసి, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎరువు కరువు

- ఖరీఫ్ సీజన్‌కు 30 శాతం కోత
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సబ్సిడీ యూరియా కేటాయింపుల్లో కోత విధించనుంది. జిల్లా వ్యాప్తంగా తాజాగా ఖరీఫ్ సాగుకు రైతాంగం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో కేంద్రం తాజా నిర్ణయం రైతన్నలకు గోరుచుట్టుపై రోకలిపోటులా మారనుంది. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 2.07 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌కు అక్షరాలా 65వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం జిల్లాలో 14,407 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయి. డిఎపి 2,105 మెట్రిక్ టన్నులు, పొటాష్ 3,690 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 8,508 మెట్రిక్ టన్నులు, సూపర్ ఫాస్పేట్ 495 మెట్రిక్ టన్నులు చొప్పున నిల్వలున్నాయని అధికారులు తెలిపారు.

ప్రతి ఏటా రైతులు అధిక మోతాదులో యూరియా వినియోగిస్తున్నారనే సాకుతో రాయితీపై అందిస్తున్న యూరియాకు కేంద్ర ప్రభుత్వం ఒకే సారి 30 శాతం అంటే అక్షరాల 20వేల మెట్రిక్ టన్నుల కోత విధించింది. సెప్టెంబరు నాటికి 65 వేల మెట్రిక్ టన్నుల అవసరం కాగా ఏప్రిల్, మే జూన్ నెలల కోటా 20 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వచ్చింది. ఈ లెక్కన ఈ సీజన్‌లో మరో 25 వేల మెట్రిక్ టన్నులకు మించి జిల్లాకు కేటాయించే అవకాశం లేదు. అయితే జులై నుంచి జిల్లాలో డిమాండ్‌కు తగినట్లుగా యూరియా కోటా విడుదల అవుతుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా ఇప్పటికే ఈ సీజన్‌కు ఎటువంటి కొరతా ఉండదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఒటిపి, వేలి ముద్రలతో పంపిణీ

కేంద్ర ప్రభుత్వం రాయితీతో ఇస్తున్న యూరియా పక్కదారి పడుతుందనే సాకుతో పంపిణీలోనూ కట్టుదిట్టమైన చర్యలను అమలు చేస్తోంది. సబ్సిడీ ఎరువులు రసాయన పరిశ్రమలకు తరలిపోతున్నాయనే సాకుతో ఇప్పటికే నీమ్‌కోటెడ్ యూరియాను వినియోగంలోకి తెచ్చిన విషయం విధితమే. తాజాగా మరో అడుగు ముందుకు వేసింది. జిల్లా వ్యాప్తంగా 310 మంది ఫెర్టిలైజర్ డీలర్లు ఉన్నారు. వ్యవసాయ శాఖ ఇటీవల ఎరువుల డీలర్లకు కొత్త ఈ పోస్ యంత్రాలను పంపిణీ చేసింది. యూరియా కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా తమ సెల్‌ఫోన్‌కు వచ్చిన ఒటిపిని డీలర్‌కు చెప్పడం లేదా వేలిముద్ర వేయడం ద్వారానే యూరియా ఇతర ఎరువులు కొనాల్సి ఉంటుంది. యూరియా పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పర్యవేక్షణ పెంచాల్సిన ప్రభుత్వం పూర్తి భిన్నంగా పంపిణీ ప్రక్రియలో రైతులను ఇబ్బందులకు గురి చేసేలా నూతన విధానాలను అమలు చేసేందుకు యత్నించటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.

ఎరువుల వినియోగం తగ్గించేందుకు అధికారులు చెబుతున్న కారణాలు

యూరియాతో పోల్చితే కాంప్లెక్స్ ఎరువుల ధరలు నాలిగింతలు అధికంగా ఉండటం రసాయన ఎరువుల వాడకంపై సరైన అవగాహన లేకపోవటం వల్ల రైతులు యూరియాను విచ్చలవిడిగా వినియోగించి నష్టపోతున్నారు. ఎకరా వరికి రెండు బస్తాల యూరియా వాడాల్సి ఉండగా నాలుగు నుంచి ఆరు బస్తాల వరకూ వాడుతున్నారు. యూరియాను వాడటం వల్ల పైరు పచ్చగా ఏపుగా ఉంటుంది. అధిక మోతాదులో వేసినపుడు తేలికగా నీటికి కొట్టుకుపోయి పైరుకు ఉపయోగపడదు. మొక్కలు సుకుమారంగా పెరగడం వల్ల చీడపీడలు, తెగుళ్ల బారిన పడతాయి. దీంతో పెట్టుబడి అధకమవుతుంది. పూత ఆలస్యంగా వచ్చి పంటకాలం పెరిగి దిగుబడి తగ్గుతుంది. వరిలో పూత దశ తర్వాత యూరియాను వేస్తే బియ్యపు గింజలో పొట్ట తెలుపు వచ్చి నూక ఎక్కువ అవుతుంది. అధిక మొత్తంగా యూరియా వాడటం వల్ల కలిగే అనర్థాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెబుతున్నారు.

యూరియా వాడకంలో మెళకువలు

ద్రవ రూప నానో యూరియా సాధారణ యూరియాతో సమానంగా పనిచేస్తోంది. నానో యూరియాను పిచికారీ చేయడం వల్ల వేగంగా మంచి ఫలితాలు వస్తాయి. రైతుకు బస్తాల భారం తగ్గుతుంది. మెట్టపైర్లలో యూరియా వేసే సమయంలో నేలలో తేమ ఉండేలా చూసుకోవాలి. మెట్టపైర్లలో యూరియాను చల్లడం కన్నా మొక్క మొదట్లో గుంట తీసి వేస్తే మంచిది. పైరుకు సిఫారుసు చేసిన యూరియాను రెండు మూడు దఫాలుగా వేసుకోవాలి. యూరియాతో పాటు వేపపిండి (50 కేజీ యూరియాకు 5 కిలోల వేపపిండి) వాడితో నత్రజని మొక్కలకు ఎక్కువ కాలం అంది చీడపీడల వ్యాప్తి తగ్గిస్తుంది. పైరును బట్టి సేంద్రియ ఎరువులు జీవన ఎరువులు వాడి యూరియా మోతాదును తగ్గించుకోవచ్చు. కాంప్లెక్స్ ఎరువులలో కూడా నత్రజని ఉంటున్నందున యూరియాను జోడించి వాడకూడదు.



ఖరీఫ్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు

రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. రసాయన ఎరువుల వినియోగం పెరగడంతో చీడపీడలు తెగుళ్ల అధికమవుతాయి. ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించడం వల్ల సాగుపై ఖర్చుల భారం తగ్గడంతో పాటు భూసారం పెరుగుతుంది. ఈ నేపథ్యంలోనే జిల్లాకు 30 శాతం కేటాయింపులు తగ్గాయి. ఈ సీజన్‌లో వరదల నేపథ్యంలో ఒంద్రు ఉంటుంది. యూరియా కేటాయింపులు తగ్గినా సాగుకు ఎటువంటి ఇబ్బందులూ ఉండవు.

- ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



పాలస్తీనాకు సంఘీభావం తెలుపుతున్న వామపక్షాలు

పాలస్తీనాకు సంఘీభావంగా ప్రదర్శన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పాలస్తీనాకు సంఘీభావంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ మారణ కాండను ఆపాలని నినదించారు. స్థానిక ఆజాద్ చౌక్ సెంటర్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పవన్, సిపిఐఎంఎల్ జిల్లా నాయకులు చీకట్ల వెంకటేశ్వర్లు మాట్లాడారు. గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న ఊచకోతను తీవ్రంగా ఖండించారు. 20 నెలలుగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో 55 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల్లో మహిళలు, చిన్నారులే అధికంగా ఉన్నారాని, ఆస్పత్రులు, పాఠశాలలు, శరణార్థుల కేంద్రాలతో సహా కీలకమైన మౌలిక వసతులన్నింటినీ ఉద్దేశ్యపూర్వకంగా నాశనం చేశారని తెలిపారు. అంతర్జాతీయ జలాల్లో ఫ్రీడమ్ ఫ్లోటిల్లాకు చెందిన మాన్ ఓడపై ఇజ్రాయిల్ జరిపిన దాడిని తీవ్రంగా నిరసించారు. అదుపులోకి తీసుకున్న అంతర్జాతీయ వాలంటీర్లందరినీ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భారత ప్రభుత్వం ఇజ్రాయిల్ పట్ల మెతక వైఖరి చూపడం సరి కాదన్నారు. వలసవాద వ్యతిరేక సంఘీభావం, జాతి విమోచన ఉద్యమాలకు మద్దతునిస్తూ భారత్ సుదీర్ఘకాలంగా అనుసరిస్తూ వచ్చిన వలసవాద వ్యతిరేక, జాతి విమోచన ఉద్యమాలకు మద్దతు ఇచ్చే విదేశాంగ విధానం నుంచి వెనక్కి తగ్గడం సిగ్గుచేటు అని అన్నారు. పాలస్తీనా ప్రయోజనాలకు ఇప్పటివరకు మన దేశం ఇచ్చిన చారిత్రక మద్దతుకు అనుగుణంగా భారత ప్రభుత్వం సూత్రబద్ధమైన వైఖరి తీసుకోవాలని తెలిపారు. భారతదేశం పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి, ఇజ్రాయిల్‌కు సైనిక, భద్రతా సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అమెరికన్ సామ్రాజ్యవాదం యుద్ధాలను ప్రోత్సహించి ఆయుధ వ్యాపారం చేసుకుంటుందని, ఇది ప్రపంచ శాంతికి విఘాతం అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.పూర్ణిమరాజు, ఐ.సుబ్రహ్మణ్యం, రాజా, ఎస్ఎస్.మూర్తి, నాయకులు పడాల రామకృష్ణ, రామచంద్రరావు, రాంబాబు, సిపిఐ పార్టీ నగర కార్యదర్శి వి.కొండలరావు, నాయకులు నల్లా రామారావు, కె.రాంబాబు, సునీల్, లావణ్య, త్రిమూర్తులు, రావణమ్మ, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు రామినిడు శ్రీనివాస్, అప్పారావు, రమణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత

చాగల్లు : చాగల్లులోని టిడిపి మండల కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం లబ్ధిదారులకు అందించారు. ముప్పవరం, ఊనగట్ల, కలవలపల్లి గ్రామాలకు చెందిన మిద్దె మంగతాయారుకు రూ.40,350, గూడపాటి కమలకు రూ.3,15,53, జొన్నకుటి నాగేశ్వరావుకు రూ.54,790, బొల్లా నాగేశ్వరావుకు రూ.53,180 విలువ చేసే చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద దిగువ మధ్య తరగతి ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వైద్యానికి ఇబ్బంది లేకుండా బాధిత కుటుంబాలను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



'జగన్ అంటే నమ్మకం '

ప్రజాశక్తి-గోకవరం

వైసిపి వ్యవస్థాపకులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అని ప్రజలు విశ్వసిస్తున్నారని వైసిపి మండల అధ్యక్షులు పాటి రాంబాబు అన్నారు. మంగళవారం గోకవరంలో మాజీ సొసైటీ అధ్యక్షులు దాసరి చినబాబు స్వగృహం వద్ద 'జగన్ అంటే నమ్మకం- బాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు మాట్లాడారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు మేలు చేసి సుభిక్షమైన పాలన అందించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సాధించిన అభివృద్ధి, విజయాలను పుస్తకంగా పొందపరిచి ఆవిష్కరించామన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైసిపి నాయకులపై కక్ష సాధింపుగా కేసులు బనాయించడం సరికాదన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఐక్యంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దాసరి చినబాబు, సుంకర వీరబాబు, లీగల్ అడ్వయిజర్ గుల్లా ఏడుకొండలు, సుంకర రమణ, సమ్మెట మోహన్, బ్యాల అబ్బులు, మడికి మైనర్ బాబు, గోకడ చిట్టిబాబు, అంబటి అబ్రహాం పాల్గొన్నారు.

చిట్టితల్లికి పెద్ద కష్టం

- ఎస్ఎంఎ టైప్-1 సమస్యతో బాధపడుతున్న చిన్నారి
- రూ.16 కోట్ల విలువైన ఇంజక్షన్ చేయాలంటున్న వైద్యులు
- దాతల కోసం తల్లిదండ్రుల ఎదురు చూపులు

ప్రజాశక్తి-కడియం

ఆ ఇంట ఆడపిల్ల పుడితే... మహాలక్ష్మి పుట్టిందని మురిసిపోయారు. బోసి నవ్వులు చూసి సంబరపడ్డారు. తమ గారాలపట్టికి ఏ లోటూ రాకుండా చూసుకోవాలని భావించారు తల్లిదండ్రులు. రెండు నెలలు తిరక్కుండానే చిన్నారి అరుదైన వ్యాధి బారిన పడిన విషయాన్ని తెలుసుకున్నారు. ప్రాణాలకు సైతం ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని వైద్యులు చెప్పడంతో తల్లడిల్లారు. ప్రాణాలకు కాపాడాలంటే రూ.16 కోట్ల విలువ చేసే ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉందని చెప్పడంతో.. ఏం చేయాలో తెలియని పరిస్థితిలో అల్లాడుతున్నారు... దాతలు కనికరిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు మాధవరాయుడు పాలేనికి చెందిన దంపతులు డొక్కా ఈశ్వర్, శ్రావణి దంపతులు...

కడియం మండలం మాధవరాయుడు పాలెంలోని చైతన్య నగర్‌కు చెందిన డొక్కా ఈశ్వర్, శ్రావణి భార్యభర్తలు. ఈశ్వర్ కడియం పేపరుమిల్లులో చిరుద్యోగి. ఇటీవలే ఆ దంపతులకు కుమార్తె పుట్టింది. చిన్నారికి ముద్దుగా మోహన అని పేరు పెట్టుకున్నారు. పాప పుట్టిందనే ఆనందం వారికి ఎన్నో రోజులు నిలవలేదు. రెండు నెలలకే పాప అనారోగ్యానికి గురైంది. ఆసుపత్రికి వెళ్తే స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ టైప్-1 అనే సమస్యతో చిన్నారి బాధపడుతున్నట్టు హైదరాబాదులోని ప్రముఖ నిమ్స్, రెయిన్‌బో ఆసుపత్రి వైద్యులు తేల్చి చెప్పారు. రెండు ఏళ్ల లోపు రూ.16 కోట్ల విలువైన ఇంజక్షన్ ఇవ్వాల్సి ఉందని, అప్పుడే పాప దక్కుతుందని, లేకపోతే ప్రాణాలకు ప్రమాదం తప్పదని తెలిపారు. అప్పటివరకు రూ.6 లక్షల విలువైన సిరప్‌ను పాపకు అందించాల్సి ఉంటుందని తెలిపారు. చిరు ఉద్యోగి అయిన ఈశ్వర్ అంత మొత్తం చెల్లించి ఇంజక్షన్ చేయించే స్థోమత లేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దాతల సహకారం కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్థిక సాయం చేసి తన కుమార్తెను బతికించాలని కోరుతున్నాడు. దాతలు 94411 01670 నెంబర్‌ను సంప్రదించాలని పాప కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.





ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్

గోకవరం సిహెచ్‌సిలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం తనిఖీ చేశారు. ఆపరేషన్ థియేటర్, జనరల్ వార్డులను పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో వివిధ రిజిస్టర్లను తనిఖీ చేశారు. మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్ అడపా భరత్‌కుమార్ కలెక్టర్‌తో మాట్లాడారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ వనజాకుమారి బదిలీ కావడంతో రోగులకు వైద్యం కుంటు పడకుండా, ఆసుపత్రికి వైద్యులు వచ్చేవరకు ఆమెను ఇక్కడే కొనసాగించాలని కోరారు. ఆమె వెంట డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మ, వైద్యులు వనజాకుమారి, తహశీల్దార్ సాయిప్రసాద్, ఆర్ఐ వల్లి, ఆస్పత్రి అభివద్ధి కమిటీ సభ్యులు రాయవరపు శ్రీనివాసరావు, పిట్టా అరుణ్, ఆసుపత్రి సిబ్బంది, కూటమి నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి-కడియం

కడియం మండలంలోని పలుగ్రామాల్లో రూ.4.56కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి మంగళవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మాధవరాయుడు పాలెంలో రూ.7లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, రూ.23.94లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని, రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయం-2 భవనాన్ని సర్పంచ్ అన్నందేవుల చంటితో కలిసి వారు ప్రారంభించారు. రూ.30 లక్షల ఉపాధి నిధులతో నిర్మించే సిమెంట్ రోడ్డుకు, రూ.20 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం దామిరెడ్డిపల్లి గ్రామంలో రూ.1.80 కోట్ల ఆర్అండ్‌బి నిధులతో చేపట్టబోయే ప్రధాన రహదారి నిర్మాణానికి, రూ.40 లక్షల ఉపాధి నిధులతో నిర్మించే మరో రోడ్డుకు సర్పంచ్ ముద్రగడ సత్య స్వరూప, ఉప సర్పంచ్ ముద్రగడ జెమ్మిలతో కలిసి శంకుస్థాపన చేశారు. వీరవరం సర్పంచ్ బత్తుల నళిని ఆధ్వర్యంలో రూ.30 లక్షల ఉపాధి నిధులతో నిర్మించే సిమెంట్ రోడ్డుకు, కడియపులంకలో రూ.70 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్డుకు, రూ.6 లక్షలతో నిర్మించే బీసీ కమ్యూనిటీ భవనానికి సర్పంచ్ పాటంశెట్టి రాంజీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, కూటమి నాయకులు మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని, బొరుసు సుబ్రహ్మణ్యం, గట్టి సుబ్బారావు, గట్టి నరసయ్య, ఆదిమూలం సాయిబాబా, పుల్లా రామారావు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎంఎల్ఎ, సర్పంచ్

ప్రకృతి సాగుతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రకృతి సాగుతో అధిక దిగుబడి సాధించొచ్చని ప్రకృతి వ్యవసాయ డివిజనల్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలంలో చెరుకుమెల్లి గ్రామంలో కాకర్ల సురేష్ రైతు పొలంలో డ్రమ్ము సీడ్ ఉపయోగించి విత్తనాల నారు మడుగులు కట్టినట్టు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో దేవరపల్లి .,గోపాలపురం మండలంలో సిబ్బందికి, రైతులకు శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సురేష్. సత్యనారాయణ, కృష్ణ, రాధ, పద్మావతి, రామలక్ష్మి, దుర్గాదేవి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ప్రజా ప్రతినిధి చంటి

ప్రజాశక్తి-కడియం

పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న మాధవ రాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి అందరికీ ఆదర్శమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఇటీవల అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా పురస్కారం అందుకున్న చంటిని మంగళవారం ఆయన నివాసంలో ఎంపీ, ఎంఎల్ఎలు అభినందిస్తూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, జిల్లా ఎస్‌పి(అడ్మిన్) మురళీకృష్ణ, కూటమి నాయకులు పుల్లా రామారావు, గట్టి సుబ్బారావు, గట్టి నరసయ్య, ఆకుల శ్రీధర్, నాగిరెడ్డి రామకృష్ణ, పి.రామారావు చౌదరి ,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




సర్పంచ్ చంటిని సత్కరిస్తున్న ఎంపీ, ఎంఎల్ఎ

గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీతంపేటలోని శ్రీ పంతం సత్యనారాయణ ఎలిమెంటరీ స్కూల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి మాట్లాడారు. విద్యార్థులు చదువుపై ఆసక్తిని కలిగి ఉండాలన్నారు. వివిధ విషయాలపై పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకుని కొంత మంది అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. బాల్య వివాహ నిషేధ చట్టం-2006, బాల కార్మిక నిర్మూలన చట్టం-1986 తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

కార్టూ'నిజం'



సంక్షేమ బోర్డు పునరుద్ధరణలో జాప్యం తగదు

ప్రజాశక్తి-కొవ్వూరు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తుందని, కాలయాపన మాని తక్ష ణం బోర్డును పునరుద్ధరించాలని ఎపి భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సమావేశం జరిగింది. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రమణరావు, ఆర్‌వి.నరసింహారావు పాల్గొని మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న సంక్షేమ బోర్డును పాలకవర్గాలు నిర్వీర్యం చేయడం తగదన్నారు. 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సంక్షేమ బోర్డు సాధించుకున్నారన్నారు. నిర్మాణ రంగంలో ప్రమాదపు అంచున కార్మికులు పనులు చేస్తుంటారన్నారు. ఈ క్రమంలో పలువురు ప్రమాదాలకు గురౌతున్నారని తెలపారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న యజమాని ప్రమాదానికి గురవ్వడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడిన దాఖలాలు అనేకం ఉన్నాయి. కష్టకాలంలో ఆయా కుటుంబాలను ఆదుకోవడానికి ఈ సంక్షేమ బోర్డు ఉపయోగపడేదన్నారు. ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం లేకపోయినా, కావాలనే రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన్నా సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేశారన్నారు. బోర్డులో నిధులు ఉన్నప్పటికీ వేలాది క్లెయిమ్స్ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వం దీన్ని పూర్తిగా నిలిపివేయడంతో లక్షలాదిమంది కార్మికుల కుటుంబాలు ఆర్థిక పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయన్నారు. బోర్డును పునరుద్ధరిస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారన్నారు. నేడు ప్రభుత్వం వచ్చినా కనీసం ఈ ఊసు ఎత్తడం లేదన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుని భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జూలై 9న పనులు బంద్ చేసి దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందర్‌బాబు, భవన నిర్మాణ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు వల్లేపల్లి నరసింహమూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షులు మైగాపుల నాగేశ్వరరావు, నాయకులు మాణిక్‌రెడ్డి, హరిబాబు, బి.భద్రం, సిద్ది రెడ్డి, బాపిరాజు, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు

పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

ఇటీవల నిర్వహించిన పశుగణన సర్వే ప్రకారం జిల్లాలో పశు వుల సంఖ్య బాగా తగ్గిందని, పశువుల సంఖ్యను పాడి ఉత్ప త్తులను గణనీయంగా పెంచేందుకు పశుసం వర్ధక శాఖ అధికారులు వివిధ పథకాలు ద్వారా పాడి పరిశ్రమ అభివద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయిలో పశు సంవర్ధక శాఖ పశువైద్యుల సిబ్బందితో సమావేశం నిర్వహించి 22 మండ లాలలో కొబ్బరిలో అంతర పంటగా మైదాన ప్రాంతాలలో రాయితీపై పశుగ్రాస విత్తనాలు అందించి పశుగ్రాస అభివృద్ధికి ఉపాధి అనుసంధానంతో చేపట్టాల్సిన చర్యలు, పాల ఉత్పత్తులపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 640 ఎక రాలలో పశుగ్రాస అభివృద్ధికై శాఖా పరంగా గుర్తించడం జరిగింద న్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డ్ ద్వారా పావలా వడ్డీ పై రూ.2లక్షల వరకు రుణాన్ని పాడిపశువుల కొనుగోలుకు లేదా పశు పరిశ్రమ ఏర్పాటుకు ఎక్కువగా చర్యలు చేపట్టాలని అదేవిధంగా ఎస్ఎస్‌జి , స్త్రీనిధి, ప్రధాన మంత్రి ఉపాధి హామీ చట్టం బిసి, ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రాయితీతో కూడిన రుణాలు బ్యాంకుల ద్వారా అందించేందుకు పాటుపడాలన్నారు. నరేగా అనుసంధానంతో మినీ గో కులాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే జిల్లాలో 1,076 మినీ గో కులాలు 90 శాతం రాయితీతో నిర్మాణంలో ఉన్నా యని అదనంగా ప్రతిపా దించిన వాటికి నిర్మాణాలకు కృషి చేయాలన్నా రు. స్థానిక వాతావరణ పరిస్థితులు ఆక్వా రంగం దోమల బెడద తట్టుకునేలా చూడడంతో పాటుగా పశుగ్రాసం దాన లభ్యత, పశువుల మనుగడ పాల దిగుబడి అంశాలను దృష్టిలో ఉంచుకొని స్థానికంగా అనువైన మేలు జాతి ముర్రా జెర్సీ ఒంగోలు పశువుల సంఖ్యను పెంచుతూ పాడి పరిశ్రమ అభివృద్ధికి పాటుపడాలన్నారు. టోటల్ మిక్స్ రేషన్ (దాణా) యూనిట్లు స్థానికంగా ఎస్ హెచ్ జి మహిళల ద్వారా నిర్వహిస్తూ అటు స్వయం సహాయక సంఘాల సుస్థిరాభివృద్ధికి ఇటు పాడి పరిశ్రమ అభివద్ధికి యోచన చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన పశువులు స్థానికంగా మనుగడ సాగించే ఎంపిక చేసి వివిధ స్కీముల కింద మంజూరు చేస్తూ స్థానికంగా పశువుల పాల దిగుబడిని అంచనాలు వేస్తూ పాడి రైతులను అన్ని విధాల ప్రోత్సహిం చాలన్నారు. 75 శాతం రాయతీపై పశుగ్రాస విత్తనాలను అందిస్తూ నరేగా అనుసంధానంతో ఏటుగట్లు, కాలువ డ్రెయినేజీ గట్లు పశుగ్రాస సాగును చేపడుతూ ప్రయోగా త్మకంగా పాడి రైతులకు అండగా నిలవాలని అధికారులను ఆదేశించారు. ఆడ దూడలకు జన్మనిచ్చి పెంచే విధానాలను అమలు చేయాలన్నారు. బ్యాంకర్లు కూడా పాడి రైతులను ఆదుకునే దిశగా పాడి యూనిట్ల గ్రౌండింగ్‌పై దృష్టిపెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్ మధుసూదన్, జిల్లా పశుసంవర్ధక అధికారి వెంకట్రావు పశువైద్యులు పాల్గొ న్నారు.

నేరాలు ఘోరాలు

3 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - పెరవలి

పెరవలి గ్రామ శివారు నిడదవోలు - నరసాపురం రోడ్డు నయారా పెట్రోల్ బంక్ సమీపంలోని శ్మశానం వద్ద 3 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్టు చేశారు. పాలుమూరి సాగర్, కర్సినపు ప్రవీణ్ కుమార్, మహ్మద్ సలీ, తగరపు వెంకట్, వర్ధనపు మణిలను అరెస్టు చేశామని సిఐ పి.విశ్వం, ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. గంజాయితో పాటూ రెండు బైకులను సీజ్ చేశామన్నారు. రిమాండ్ నిమిత్తం నిందితులను తణుకు కోర్టుకు తరలించామన్నారు.

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి -కొవ్వూరు

గోదావరి నదిలో కొవ్వూరు గామన్ బ్రిడ్జి 46వ పిల్లర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. పట్టణ పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని వెలికి తీశారు. మృతుని వయస్సు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహం బాగా పాడైన స్థితిలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ మార్చురికి తరలించినట్లు పట్టాన సిఐ పి.విశ్వం తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - అమలాపురం

జనసేన పార్టీ అమలాపురం నియోజకవర్గం సీనియర్ నాయకులు చిక్కం భీముడు ఆధ్వర్యంలో అమలాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు రైతులు మంగళవారం కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యపై వినతిపత్రం సమర్పించారు.రైతులు తెలిపిన మేరకు, మేజర్ డ్రెయిన్ ద్వారా సముద్రపు ఉప్పు నీరు ప్రవహిస్తూ పంటకాలువలు, చిన్న కాలువల్లోకి చేరి వారి పంట భూములు ఉప్పు నీటి ప్రభావానికి లోనవుతున్నాయన్నారు. దీనివల్ల రైతులు సంవత్సరానికి ఒకే ఒక్క పంటకే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించాలని కోరుతూ, రైతులు పలు సూచనలు చేశారు.రెండు మేజర్ డ్రెయిన్‌లు కలిసే ప్రదేశంలో ఆటోమేటిక్ రెగ్యులేటరీ సిస్టమ్‌తో పవర్ లిఫ్ట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. డ్రెయిన్‌లను పూడికతీసి మరమ్మతులు చేయాలనీ, గట్లు బలపరచాలనీ, ఇసుక మేటలను తొలగించాలన్నారు. ఈ చర్యల ద్వారా ముంపు సమస్యను నివారించి, ఉప్పు నీటి ప్రభావం లేకుండా రైతులు రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మోటూరి రవి, నల్లా బాపండి, చిక్కం పెద్దబ్బులు, నల్లా సత్యనారాయణ, బండారు వెంకటేశ్వరరావు, రవణం మధు, అడబాల సత్యనారాయణ, మంచం బాలకృష్ణ, ఆకేటి వెంకన్న, గొల్లకోటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లపై నిరంతర నిఘా

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్కానింగ్ సెంటర్లపై నిరంతర నిఘా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బహుళ సభ్యుల సాధికార కమిటీ, జిల్లా సలహా కమిటీ సమావేశం జరిగింది. దీనికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. గర్భస్థ శిశువు నిర్ధారణ చేయడం, లింగ ఎంపిక నిషేధం అని అటువంటి ఘటనల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భస్త శిశువు నిర్ధారణ పరీక్షలు చేయడం, అబార్షన్, పోస్ట్ అబార్షన్ కోసం వాడే మందులు వినియోగంపై ప్రతి నెలా డ్రగ్స్ కంట్రోలర్ ద్వారా సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. డికాయిట్ ఆపరేషన్ కోసం ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవస్థ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. స్కానింగ్ సెంటర్స్ విషయంలో కొత్తగా అనుమతులు, ప్రస్తుతం కొనసాగుతున్న వాటికి రెన్యువల్, సవరణలు విషయంలో నిబంధనలు పాటించాలన్నారు. డెకాయట్ ఆపరేషన్ సమయంలో ఎటువంటి లోపాలు లేవని నివేదిక ఇవ్వడం సంతృప్తి చెందేలా లేదన్నారు. ఆయా స్కానింగ్ సెంటర్లలో పని చేసే రేడియోలజిస్ట్ వివరాలు, ఎక్కడ పనిచేస్తున్నారనే విషయాలు తెలపాలన్నారు. పిసి అండ్ పిఎన్‌డిటి యాక్ట్ 1994, 1996లో నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి ఆయా స్కానింగ్ కేంద్రాలు, ఆసుపత్రుల సేవలపై డెకాయిట్ ఆపరేషన్ ఉండాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిఐఒ పి.కోమల, గైనకాలజిస్ట్ హెడ్ డాక్టర్ అక్కమాంబ, శిశు వైద్యుడు డాక్టర్ మోహన్ చంద్ర, పాథాలజీ డాక్టర్ వెంకటలక్ష్మి, పిసి అండ్ పిఎన్‌డిటి ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ పిఎస్ఎల్.ప్రసన్న, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పి.సుధాకర్‌బాబు, డాక్టర్ జె.సంధ్య, డివిజనల్ పిఆర్ఒ లక్ష్మణా చార్యులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి-నిడదవోలు రూరల్

మండలంలోని తాళ్లపాలెం, శెట్టిపేట, అట్లపాడు పట్టణంలోని ఎంవినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం చేపట్టారు. సెక్టార్ సూపర్‌వైజర్ సిహెచ్.లక్ష్మి మాట్లాడారు. పిల్లల్లో సామాజిక, మానసిక అభివృద్ధి సక్రమంగా అభివృద్ధి చెందాలంటే అది అంగన్‌వాడీ కేంద్రాల్లోనే సాధ్యమన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పి.పద్మ, రత్నకుమారి, లిల్లీ పుష్ప, కాంతశ్రీ, నాగజ్యోతి, జొహన్నా, వసంతకుమారి, వరలక్ష్మి, కనకదుర్గ, ఎంఎస్‌కెలు పాల్గొన్నారు.

టిడిపి నేత వేమగిరి మోషేకు సతీవియోగం

ప్రజాశక్తి - మండపేట

మండపేట టిడిపి నాయకులు వేమగిరి మోషే సతీమణి వేమగిరి లక్ష్మి (44) గుండె సంబంధిత సమస్యతో ఆకస్మికంగా మృతి చెందారు. గత మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మి మంగళవారం ఉదయం తుది శ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల మండపేట ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రు వర ప్రకాష్, టిడిపి యువనేత కుమార్ బాబు, మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మందపల్లి దొరబాబు, ఎంఆర్‌పిఎస్ నాయకులు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

సమగ్ర శిక్షా కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు బదిలీ

ప్రజాశక్తి - ముమ్మిడివరం


వెంకటేశ్వరరావుకు వీడ్కోలు చెబుతున్న సిబ్బంది

సమగ్ర శిక్షా కార్యాలయ సూపరిండెంట్‌గా విధులు నిర్వహిస్తూ జిల్లా విద్యా శాఖ కార్యాలయం సూపరింటెండెంట్‌గా ఎం.వెంకటేశ్వరరావు బదిలీ అయ్యారు. సమగ్ర శిక్ష ఎఫ్ఎస్‌టిసిగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావు ముమ్మిడివరం డిఇఒ కార్యాలయానికి సూపరిండెంట్‌గా బదిలీపై వెళ్తున్న వెంకటేశ్వరరావును మంగళవారం సహా సిబ్బంది సత్కరించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఎపిసి జి.మమ్మీ మాట్లాడుతూ వెంకటేశ్వరరావు సూపరిండెంట్‌గా విధి నిర్వహణలోఅందించిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఎఒ బి వివిఎస్ రంగారావు, జెఎఒ జి.ప్రవీణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, సెక్టోరల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు బదిలీలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సమగ్ర శిక్షాలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు బదిలీల షెడ్యూల్ జారీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయని జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో- ఆర్డినేటర్ జి.మమ్మీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాల మేరకు ఉద్యోగ బదిలీల్లో భాగంగా రిక్వెస్ట్, మ్యూచువల్ బదిలీలతో పాటు సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో విధులు నిర్వర్తిస్తున్న ఐఆఆర్‌పిలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్, సిఆర్‌ఎంటీలు, మండల లెవెల్ అకౌంటెంట్లు, సైట్ ఇంజనీర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజెర్స్, ఆఫీస్ సబార్డినేట్స్‌కు బదిలీలు ఉంటాయన్నారు. ఈ బదిలీలకుకలెక్టర్ చైర్మన్ గా జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 19 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో బదిలీలకు దరఖాస్తులు స్వీకరిస్తారని, 23న సీనియారిటీ జాబితా సిద్ధం చేసి, 24న ప్రదర్శిస్తారని ఆమె తెలిపారు. బదిలీ దరఖాస్తుల పై అభ్యంతరాలను 27వరకు స్వీకరిస్తారన్నారు. అభ్యంతరాల అనంతరం 28న సీనియారిటీ జాబితాను ప్రదర్శిస్తారని. బదిలీ దరఖాస్తులకు ఈ నెల 30 నుంచి జూలై 2వ తేదీ వరకు కౌన్సిలింగ్ నిర్వహించి, ఉత్తర్వులు ఇస్తామన్నారు. బదిలీలపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే జూలై5 లోపల రాష్ట్ర కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం


పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న సుజాత రాణి

అంగన్ వాడీలు బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించవచ్చునని ఏలూరు జోన్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి.సుజాత రాణి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 7 ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని సిడిపిఒలు, సూపర్ వైజర్ లకు ముమ్మిడివరం మండల పరిషత్ కార్యాలయం సమావేశపు హాలు నందు మంగళవారం బి.శాంత కుమారి అధ్యక్షతన జాతీయ విద్యా విధానంపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సుజాత రాణి ముఖ్య అతిథిగా పాల్గొని బాల బాలికలకు ప్రాథమిక స్థాయి నుండే సులభరితిలో అర్థమయ్యే విధంగా నవ చేతన, అదర్శరీ కర దీపికల పాఠ్య పుస్తకాలలోని అంశాలను ఆట ఆధారిత బోధనా నైపుణ్య పద్ధతులు, సాంస్కృతిక పరమైన ఆనుభవ పద్ధతుల ద్వారా పిల్లల శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ, భాషాభివృద్ధికి బోధన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా ప్రాథమిక బోధనను ప్రత్యేకరితిలో బోధించి చదువుపై ఆసక్తిని పెంపొందించ వచ్చునని వివరించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉన్న సిడిపిఒ, సూపర్ వైజర్ లకు పిపిఐ (3ం) మ్యాథ్స్, ఇంగ్లీష్, తెలుగు, పిపిఐ (4ం))మ్యాథ్స్, ఇంగ్లీష్, తెలుగు యాక్టివిటీ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిడిపిఒలు ఎం నిహారిక(ముమ్మిడివరం), వై.విజయ శ్రీ (పి.గన్నవరం), వైకెడి. రమాదేవి (అమలాపురం), ఎ.గజలక్ష్మి(కొత్తపేట), వివి.వరలక్ష్మి (రామచంద్రాపురం)లతో పాటు పోషన్ అభియాన్ సిబ్బంది ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - అమలాపురం


కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న శ్రీనివాస్

జిల్లాకు నూతన జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా నియమితులైన సిహెచ్. శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆయన ఉద్యోగ బాధ్యతలను బదిలీపై వెళ్లిన కె.లక్ష్మీ నారాయణ నుంచి మంగళవారం స్థానిక కలెక్టరేట్ నందు స్వీకరించారు. ఈ మేరకు ఆయన కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహు కరించారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన డిఐపిఆర్ఒ కె. లక్ష్మీ నారాయణ, డివిజనల్ పీఆర్ఒ వివి.రామి రెడ్డి సిబ్బంది నాగరాజు, నరసింహారావు పి.విఘ్నేశ్వరి పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం మధ్యాహ్నం మాతృ మరణాలు, శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మాతా, శిశు మరణాలు సంభవించడం చాలా బాధాకరమన్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి డెలివరీ అయ్యే వరకు తల్లి ఆరోగ్య పరిస్థితుల్లో తేడాలను ఎప్పటికప్పుడు గుర్తించి, తగు సూచనలు చేయడం, వైద్య పరమైన అంశాల గురించి అవగాహన కల్పించడం ముఖ్యమన్నారు. గోకవరం పిహెచ్‌సి పరిధిలో జరిగిన మాతృ మరణం, వేమగిరి పిహెచ్‌సి పరిధిలో ఒక రోజు వయస్సు గల చిన్నారి మృతి, మార్కొండపాడు పిహెచ్‌సి పరిధిలో 39 రోజుల చిన్నారి మృతి చెందిన కేసులు విషయమై సంబంధిత పిహెచ్‌సి సిబ్బంది, వైద్యుల సమక్షంలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలపాలని వైద్యులకు సూచించారు. గోకవరం పిహెచ్‌సి పరిధిలో జరిగిన మాతృ మరణంపై క్షేత్ర స్థాయిలో కేసు పూర్వాపరాలతో రీకన్‌స్ట్రక్షన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిఐఒ డాక్టర్ పి.కోమల, గైనకాలజిస్ట్ హెడ్ డాక్టర్ అక్కమాంబ, శిశువైద్యుడు డాక్టర్ మోహన్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యా మిత్ర కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలో విద్యార్థి మిత్ర కిట్లను ఎంఇఒ సుబాకర్ మండలంలో ఉన్న పాఠశాలల హెచ్‌ఎంలకు మంగళవారం అందించారు. మండలంలో మొత్తం 2,931 మంది విద్యార్థులు ఇప్పటివరకు పాఠశాలల్లో చేరారన్నారు. వారికి మొదటి విడతగా ఇప్పటి వరకూ 1,53,870 పుస్తకాలను అందించామన్నారు. 1,957 బెల్టులు, 3,034 షూలు, 2,931 యూనిఫామ్, 20,249 నోటు పుస్తకాలు, 2,931 బ్యాగులు, 450 డిక్షనరీలు ఇప్పటి వరకూ అందించామన్నారు. మిగిలినవి సెమిస్టర్-2 అందిస్తామని తెలిపారు.

టిడిపి అయినవిల్లి మండల అధ్యక్షునిగా శ్యామ్ చంద్రరావు

ప్రజాశక్తి - అయినవిల్లి

మండల టిడిపి అధ్యక్షుడిగా అయినవిల్లి లంక గ్రామానికి చెందిన వస్కా శ్యామ్ చంద్ర రావు (శ్యామ్) ఎన్నికయ్యారు అధ్యక్ష పదవికి బడుగు భాస్కర జోగేష్, వస్కా శ్యామ్ చంద్ర రావు పోటీ పడగా ఎన్నికల పరిశీలకులు రెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు 44 మందితో ఓటింగ్ నిర్వహించారు ఇందులో వస్కా శ్యామ్ చంద్రరావుకు 27 ఓట్లు, బడుగు భాస్కర జోగేష్‌కు 17 ఓట్లు రావడంతో వస్కా శ్యామ్ చంద్ర రావు మండల అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వీరవెల్లిపాలెం గ్రామానికి చెందిన మేడిశెట్టి అంజిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్యామ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి ఎఎంసి చైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు, మోకా ఆనంద సాగర్, మద్దాల సుబ్బారావు, మాజీ ఎంపిపి సలాది పుల్లయ్య నాయుడు, టిడిపి పార్టీనాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాక్ దాడిని అన్ని దేశాలు ఖండించాయి: ఎంపీ

ప్రజాశక్తి - అమలాపురం



మాట్లాడుతున్న ఎంపీ హరీష్

కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్ర దాడులను అన్ని దేశాలు ఖండించాయని అమలాపురం ఎంపి గంటి హరీష్ తెలిపారు. అమెరికా, పనామా, గయానా, బ్రెజిల్, కొలంబియా దేశాలకు అఖిల పక్ష ప్రతినిధుల బృందంలో సభ్యునిగా పర్యటన అనంతరం అమలాపురం తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం సత్యనారాయణ గార్డెన్స్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల పక్ష బృందాలు వెళ్లిన దేశాలన్నీ భారతదేశానికే మద్దతు తెలిపాయని చెప్పారు. భట్నవిల్లి, పేరూరు మధ్య రైల్వే లైన్ ల్యాండ్ ఎక్విజేషన్ పై జాయింట్ కమిటీ వేశామని, త్వరలో ఒక నిర్ణయం వస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ సిఇఒ

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ప్రజలకు జవాబుదారీగా ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించాలని కాకినాడ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.రాంగోపాల్ అన్నారు. మంగళవారం ఆయన మండల ప్రజా పరిషత్‌ను సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిడిఒ బికెఎస్ఎస్.వెంకట్ రామన్‌కు పలు సూచనలు ఇచ్చారు. సిబ్బంది అంత సమన్వయంతో పనిచేసే ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలోమండల పరిషత్ పరిపాలనాధికారి, వి.రామ స్వరూప్, సీనియర్ సహాయ కులు పి.అనిల్ కుమార్, జూనియర్ సహాయకులు, ఆర్ఎస్.ప్రత్యూష,పెపిస్టు పి.పురుషోత్తమ రావు పాల్గొన్నారు.


మండపేటలో బాధిత కుటుంబాలకు చెక్కులను అందజేస్తున్న ఎంఎల్ఎ వేగుళ్ల

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - మండపేట

ఇటీవల వివిధ ఆసుపత్రుల నందు వైద్యం చేయించుకుని ఆర్థిక సహాయం కొరకు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న 36 మందికి రూ.32,38,117 మంజూరయ్యింది. ఈ చెక్కులను మంగళవారం మండపేట టిడిపి కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు చేతులమీదిగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీరు సరఫరా

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉప్పలగుప్తం పంచాయితీ శివారు దళిత గ్రామాల్లో గత కొన్ని రోజులుగా ప్రజలు తీవ్ర తాగు నీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో గ్రామానికి చెందిన జనసేన నాయకుడు చిక్కం సూర్య మోహన్ మంగళవారం తన సొంత ఖర్చులతో ట్యాంకర్ ద్వారా తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న శివారు గ్రామాలు ఏటిమెరక, దోనిపాటివారి పేట, బడుగు పేట గ్రామాలకు తాగు నీటిని ట్యాంకర్ ద్వారా ఇంటింటికి సరఫరా చేశారు. తాగునీటి ఇబ్బందులను చూసి స్పందించి చొరవ చూపి తాగునీరు అందించిన సూర్య మోహన్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులను దత్తత తీసుకున్న మంత్రి

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు పి 4 కార్యక్రమం ప్రవేశ పెట్టిన సిఎం ఆశయం మేరకు 63 మంది పిల్లలను దత్తత తీసుకుంటున్నామని రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. పేద విద్యార్థుల చదువు కోసం దాతలు రూ.20 లక్షలు విరాళం అందించడం పట్ల ఆయన కతజ్ఞతలు తెలిపారు. వెంకటాయపాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

టిబిపై అవగాహన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

రాజమహేంద్రవరం అర్బన్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శంభునగర్‌లో ఇంటర్సిఫైడ్ టిబి క్యాంపెయిన్‌ను మంగళవారం నిర్వహించారు. 67 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ దయానంద్ మాట్లాడారు. క్షయపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, బరువు తగ్గడం, రాత్రి పూట జ్వరం, కళ్లెంలో రక్తం పడడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సిబ్బంది సంప్రదించాలని సూచించారు. టిబి సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ టిబి నివారణ మందులు వాడుతున్న వారికి పౌష్టికాహారం అందించడానికి దాతలు ముందుకు రావాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రకటన

తాతపూడి రాణి, W/o. టి.కృపావరం, డోర్ నెం. 3-113, మాదాపురం, ఇసుకపల్లి పోస్ట్‌కు సంబంధించిన కొత్తపల్లి మండలం, పొన్నాడ గ్రామంలో సర్వే నెంబర్ 161/4 లో 0.50 సెంట్లు జిరాయితీ, పల్లం భూమికి సంబంధించి **దాక్యుమెంట్ నెం. 1370/1987** నెంబర్ గల పత్రాలు పడిపోవడంతో నఖాల్లు ద్వారా రైతు నేస్తం లోన్ కొరకు మా బ్యాంకును సంప్రదించారు. ఈ డాక్యుమెంట్‌పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లోగా సంబంధిత వ్యక్తులు మా బ్రాంచ్‌ని సంప్రదించగలరు.

అడ్రస్:
ది జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్
కాకినాడ, బ్రాంచ్: యు.కొత్తపల్లి, సెల్: 9553993377

దస్తావేజులు పోయినవి

శ్రీమతి నల్ల రీతారాణి, భర్త : హరిప్రసాద్, వయస్సు : 38 సం.లు, హిందూ, స్త్రీ, నివాసం : డి.నెం.1-104, బ్రాహ్మణగూడెం గ్రామం, చాగల్లు మండలం, తూర్పు గోదావరి జిల్లా అను నేను ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, నాకు గల తూ.గో.జిల్లా, చాగల్లు మండలం, కలవలపల్లి గ్రామంలోని ఆర్.యస్. నెం.111 లోని ఎ.0.60 సెంట్లు భూమి, **రిజిష్టర్డు అమ్మకం దస్తావేజు డాక్యుమెంట్ నెం.5141/2006, తేది.27-11-2006** నాటి డాక్యుమెంట్ యొక్క ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్లు, **తేది.13-06-2025** నాదు **నేను** మా ఇంటి నుండి బ్రాహ్మణగూడెం గ్రామం లోని జిరాక్స్ షాపు నకు వెళ్తుండగా మార్గము మధ్యలో పడిపోయినవి. నేను నా ప్రయత్నం మేరకు చుట్టుప్రక్కల ఎంత వెతికినను దొరికియుండలేదు. ఎవరికైనా దొరికిన యెడల పైన తెలిపిన చిరునామకు తెలియపర్చగలరు.

ప్రకటన

C.P. రెడ్డి ఆటోమొబైల్స్, ప్రొప్రయిటర్/ మేనేజింగ్ డైరక్టర్, డో.నెం. 6-5-4, ఇన్నీసుపేట, మెయిన్‌రోడ్డు, రాజమండ్రి అను మేము ఇచ్చిన ప్రకటన వివరములు.

జై శ్రీనివాస్ శీలంశెట్టి, డో.నెం. 296/2, లక్ష్మీవారపు పేట, దేవిచౌక్, రాజమండ్రి వారి వెహికల్ నెం. AP 05 DW 1661 నెంబరు గల వాహనము మరమ్మతుల లోపం చూపుతూ నష్టపరిహారం కోరుతూ రాజమండ్రి Consumer Commission II నందు దాఖలు అయిన కేసు నెం. CC 16/22,న శ్రీ కోర్టు వారు 19-7-2024వ తేదీన తిరస్కరించియున్నారు. Consumer Commission II కేసు నెంబరులోనే దాఖలు అయిన IA 57/24 ప్రకారం మీయొక్క వాహనం, ఖర్చులు చెల్లించి తీసుకుని వెళ్లవలసినదిగా తెలియజేసినాము. ఈ విషయం తెలిసినప్పటికి బాధ్యతగా మీకు తెలియజేస్తున్నప్పటికీ మీరు రావడం లేదు. మీ బండి మా వర్క్ షాపులోనే చాలా రోజులు నుండి ఉన్నది. తక్షణమే తీసుకుని వెళ్ళవలయును. లేని యెడల కంపెనీ రూల్స్ ప్రకారం షోరూం వారికి ఎటువంటి బాధ్యత లేదని తెలియపరుస్తున్నాము.

C.P.రెడ్డి ఆటోమొబైల్స్
రాజమండ్రి ఇన్నీసుపేట, మెయిన్‌రోడ్డు
17-6-2025 రాజమండ్రి

ప్రకటన

నా క్లయింటు అయిన ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామ కాపురస్తులు **కొడేల మరిడిబ్బాయి గారి భార్య చంద్రకళ** నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియచేయినది ఏమనగా.

నా క్లయింటు యొక్క లింకు దస్తావేజు అనగా ది.12-01-2009వ తేదిన పెద్దాపురం గ్రామ కాపురస్తులు సేనాపతి గంగాభవాని గారి వల్ల క్రియం పొందినటువంటి యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి క్రయదస్తావేజు వ్రాయించుకుని పెద్దాపురం సబురిజిస్ట్రారు వారి ఆఫీసులో ద.నెం.51/2009రుగా రిజిష్ట్రీ పొంది స్వాధీనం చేసుకొన్నటువంటి ఆస్తి తాలూకు ఒరిజినలు దస్తావేజు నా క్లయింటు తన యింటి నుండి ఏలేశ్వరం వెళ్లుతుండగా మార్గ మధ్యలో పడిపోయినది. గాన సదరు దస్తావేజు గల బ్యాగు దొరికిన యెడల నాకు తెలియచేయగలరు. యింకనూ తెలియచేయునది ఏమనగా సదరు దస్తావేజును పురస్కరించుకుని ఏవరైనా ఎట్టి దస్తావేజులు దాఖలు చేసిననూ అట్టివి నా క్లయింటును ఎంత మాత్రం బైండు చేయజాలవు.

ఆస్తికి షెడ్యూలు: తూర్పుగోదావరి జిల్లా, పెద్దాపురం మండలం, పెద్దాపురం సబుడి పెద్దాపురం మునిసిపలు ఏరియా, పెద్దాపురం గ్రామం తాలూకు వార్డు నెం. 3రు, డోర్.నెం.3.2.22/3 రు టి.యస్.నెం. 1.1.0/2సి మరియు 10/2ర్లు లో గల డాబా యిల్లు స్థలంలో ఉత్తరం వైపు గల స్థలం కు హద్దులు కొల్తలు: **తూర్పు:** అ 25.6లు కనపర్తి నాగరాజు వగైరాలు యిల్లు స్థలం. **దక్షిణం:** అ 40.0లు యర్రా సూర్యప్రకాశరావు యీ రామగణేష్ గార్లు యిల్లు స్థలం. **పడమర:** అ 25 లు రాజవీధి. **ఉత్తరం:** అ 40లు యర్రా అప్పారావు గారి గొడ. యీ హద్దుల మధ్య చ.గ.114.3లు స్థలం అందలి మామూలు మార్గములు నీటివనర్లు సర్వం సహా.

SIDDANTHAPU THIRUMALA RAO, B.A, B.L. Advocate
#5-81, Valluru/Vunduru, Samalkot Mandal,
Kakinada District. Cell: 8897431181

In the Court of the Ist Additional Senior Civil Judge at Kakinada
E.P. No. 94/2023 in
O.S. No. 453/2017

Between:
Medisetti Vijaya Bhaskar
...DHr/ Plaintiff
AND
Vallu Satyam @ Pandu
and another ***...JDr's/ Defendants***
To:
JDr-1: Vallu Satyam @ Pandu, S/o. Chandrarao, D.No. 4-136/1, Sampara, H/o. Muktheswaram, Pedapudi Mandal, Kakinada Dist.,
JDr-2: Vallu Durga, W/o. Satyam @ Pandu, House wife, D.No. 4-136/1, Sampara, H/o. Muktheswaram, Pedapudi Mandal, Kakinada Dist.,

పై నెంబరు అమలు గ్రంధములో 1వ మరియు 2వ JDr's లు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 25-6-2025వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై అమలు గ్రంథము మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
చిక్కాల వీరవెంకట సత్యనారాయణ (అబ్బు)
అడ్వకేటు, రామారావుపేట
కాకినాడ, సెల్: 9848252425

ప్రకటన



కీ॥శే॥ గారపాటి వెంకటేశ్వరరావు (లేటు)

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలం, సమనస గ్రామ కాపురస్తులు గారపాటి రామలక్ష్మి, W/o. గారపాటి వెంకటేశ్వరరావు (లేటు) వ్రాయించి ఇచ్చిన ప్రకటన. నా భర్త **గారపాటి వెంకటేశ్వరరావు,** S/o. వెంకటరావు, సమనస గ్రామంలో మా ఇంటి నెం. 3-63 వద్ద ది. 15-08-2010 సంవత్సరంలో అనారోగ్యంతో మరణించారు. వీరి మరణం సమనస గ్రామపంచాయతీలో నమోదు కాలేదు. ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పది రోజులలో తెలియజేయగలరు.

ఇట్లు: గారపాటి రామలక్ష్మి
W/o. వెంకటేశ్వరరావు (లేటు)
సమనస అమలాపురం మండలం
సెల్: 95507 68186

మహారాజశ్రీ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, విజయవాడ వారి ముందు
F.A. No. 10/2025

బిట్వీన్ :
మెస్సర్స్. పియుఆర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్
.... అప్పిలెంట్
అండ్
వాసంశెట్టి వెంకట రమణ మరియు 2 ఇతరులు
.... రెస్పాండెంట్స్

రెస్పాండెంట్ నెం.2 :
ది ప్రొప్రయిటర్, కె.వి.ఆర్. మోటార్స్, సత్యదేవ ఇ-స్కూటీ, రిప్ బై ఇట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ శ్రీనివాసరావు, డోర్ నెం.6-232, అచ్చంపేట జంక్షన్, పిఠాపురం రోడ్డు, తిమ్మాపురం గ్రామం, కాకినాడ - 533005. .... రెస్పాండెంట్ నెం.2

పై నెంబరు అప్పీల్ ప్రతివాది నెం. R2 పై రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ విజయవాడ వారి ఎదుట హాజరు నిమిత్తం ది. 4-7-2025నకు వాయిదా అయివున్నది. కావున పై ప్రతివాది సత్యదేవ ఇ-స్కూటీ ఆర్-2 ది. 4-7-2025 ఉదయం 10-15 ని॥లకు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలున్న తెలుపు కోవలయును. లేనియెడల వాదిపై పరోక్షమున తీర్మానింపబడునని ఇందుమూలంగా తెలియజేయట మైనది.

(శ్రీ రాష్ట్ర వినియోగదారులు వివాదాల పరిష్కార కమిషన్, విజయవాడ ఉత్తర్వులననుసరించి)
డి.శ్రీరామ్ పవన్‌కుమార్,
అడ్వకేట్,
30-5/4-2/3ఎ, ఆర్‌కె ఎన్‌క్లేవ్,
లబ్బీపేట, విజయవాడ- 520010
సెల్ నెం : **9492941223**

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE PITHAPURAM.
EP No. 21/23 in
OS NO. 438/2008

Between:
Surla Gangunaidu. **DHR/Plaintiff**
And
1. Annamreddy Venkata Ramana, S/o Gangaraju, Aged 55 years, K. O. Mallavaram, Tuni Mandal. - **4th Jdr / Defendant.**
2. Petla Veerraju, W/o Appala Naidu, aged 65 years, Dharmasagaram village, Narsipatnam mandal. - **6th Jdr / Defendant.**
3. Yeka Ammaji, W/o Raju, aged 45 years, K. O. Mallavaram, Tuni Mandal. **7th Jdr/Defendant.**
4. Annamreddy Ammanna, W/o late. Appalanaidu, aged 56 years housewife, K. O. Mallavaram village, Tuni mandal. - **8th Jdr / Defendant.**
5. Annamreddy Varalakhsmi, W/o late. Satyanarayana, Aged 56 years, housewife, Dharmasagaram, Narsipatnam mandal.- **11th Jdr/Defendant.**
6. Annamreddy Surya Chandra Raghu Ram, S/o late. Satyanarayana, aged 30 years, Dharmasagaram village, Narsipatnam mandal. **12th Jdr/Defendant.**
7. Petla Vijayalakshmi, W/o Satti Babu and D/o late. Satyanarayana, aged 37 years, Dharmasagaram Village, Narsipatnam mandal. **13th Jdr / Defendant.**

పై నెంబరు అమలు పిటిషన్ యందు కోర్టు ద్వారా పంపిన సేల్ నోటీసులను యిందలి **Jdrs /Defendants** తీసుకొనకుండా తప్పించు కొనుచున్నందునది. **25-06-2025** తేది ఉదయం **గం॥10-30** ని॥లకు శ్రీ కోర్టువారి యెదుట వ్యక్తి గతంగాను కాని ప్లీడరుగారి ద్వారా గాని హాజరుకావలెను. అట్లు కానియెడల **Jdrs /Defendants** పరోక్షంలో కేసు నిర్ణయింపబడును

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఇచ్చిన బహిరంగ ప్రకటన)
జి.డి.ప్రసన్న కుమార్
అడ్వకేట్, పిఠాపురం
సెల్‌నెం.9395389211